క్లుప్తంగా

ప్రధానోపాధ్యాయులకు సన్మానం



విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో సన్మానం పొందిన ప్రధానోపాధ్యాయులు

కనగానపల్లి: ఉత్తమ సేవా అవార్డులు పొందిన మండలంలోని ఇద్దరు ప్రధానోపాధ్యాయులను గురువారం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు లక్ష్మీపతి (హెచ్‌ఎం, తూంచర్ల), రాంగోపాల్ (హెచ్‌ఎం, పీకే తండా)కు పూలమాలలు, శాలవాలు వేసి సన్మానించారు. విద్యాభివృద్ధి కోసం వారు చేస్తున్న కృషిని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి, కేజీబీవీ ఎస్‌ఓ నరసమ్మ, ఎంఐఎస్ రామన్న, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు తప్పనిసరి



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు తప్పక చేయించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సూచించారు. మండల పరిధిలోని ఎన్‌ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 70 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన వారికి చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ సత్యనారాయణ భోజన సౌకర్యం కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు



ఓబన్న

బత్తలపల్లి: స్థానిక టోల్ ప్లాజా సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్రవాహనం ఢీ కొనడంతో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన సమాచారం.. గార్లదిన్నె మండలం పాత కల్లూరు గ్రామానికి చెందిన నడిపోగుల ఓబన్న బుధవారం అనంతపురంలో జరిగిన సూపర్‌సిక్స్ సభకు గ్రామంలో ఏర్పాటు చేసిన బస్సులో వచ్చాడు. సభ అయిపోయిన తరువాత తిరుగు ప్రయాణంలో కదిరి వైపు వెళ్లే బస్సులో ఎక్కాడు. ఈయనకు మాటలు రాకపోవడం, కొత్త వ్యక్తి కావడంతో టోల్ ప్లాజా వద్ద బస్సులో నుంచి దింపేశారు. బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో టోల్ ప్లాజా వద్ద నుంచి నడుచుకుంటూ వస్తుండగా ద్విచక్రవాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఈయన ఫొటో సోషల్ మీడియాలో పోలీసులు వైరల్ చేయడంతో గుర్తు పట్టి బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతుడు కిష్టప్ప (ఫైల్)

నల్లమాడ: తెలంగాణాలోని రంగారెడ్డి జిల్లా కద్తాల్ బస్టాప్ వద్ద ఈనెల 5న కారు ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన నరసపు కిష్టప్ప(55) కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే ప్రమాదంలో కొండ్రవారిపల్లికి చెందిన జే. రంగస్వామినాయుడు (50) ఇదివరకే మృతిచెందగా ఆయన భార్య ఆదిలక్ష్మి తీవ్ర గాయాలతో కదిరిలోని ఓ ప్రైవేట్ చికిత్స పొందుతోంది. తీవ్రంగా గాయపడిన కిష్టప్పను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య గౌరమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పోక్సో యాక్ట్‌పై అవగాహన

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల్లో గురువారం సీడీపీఓ సరస్వతి అధ్యక్షతన జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ శివలత పోక్సో యాక్ట్- 2012పై అవగాహన కల్పించారు. బాల్య వివాహం జరిపితే పోక్సో యాక్ట్‌పై శిక్షకు గురవుతారన్నారు. బాల బాలికలు చెడుదారి పట్టకుండా విద్యను అభ్యసించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రసన్న, ఎంఈఓలు చలపతి, రమణ, సిబ్బంది మేఘన, ఐసీడీఎస్ సూపర్ వైజర్ చంద్రమ్మ, సచివాలయ సిబ్బంది కనకదుర్గ, దేవిక, నాగేంద్రమ్మ, సమత, ఎస్జీటీ కళావతి, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా!



కనగానపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ తీగలపై పెనవేసుకున్న డిష్ కేబుల్



కనగానపల్లి బీసీ కాలనీలో రహదారిపై కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు



మామిళ్లపల్లి సమీపంలో ప్రధాన రహదారి పక్కన పొలంలో కట్టెలపై లాగిన విద్యుత్ తీగలు

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. గత నెలలోనే కనగానపల్లి మండలంలో ఇద్దరు వ్యక్తులు విద్యుత్ ప్రమాదాలతో మృత్యువాతపడ్డారు. మండల కేంద్రం కనగానపల్లిలో చెరువు కట్ట సమీపంలో విద్యుత్ తీగలు తగిలి రైతు కూలీ తలారి రాజన్న మృతి చెందాడు. ఇక తూంచర్ల గ్రామంలో వ్యవసాయ పొలంలో స్టార్టర్ పెట్టెకు విద్యుత్ ప్రవహించి రైతు అక్కులప్ప మృత్యువాత పడ్డాడు. కాని విద్యుత్ అధికారులు ప్రమాదాలు నివారించటంలో నిర్లక్ష్యం చూపుతున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రం కనగానపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందే 11 కేవీ విద్యుత్ లైన్ తీగలకు డిష్ కేబుల్ పెనవేసుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇక సబ్‌స్టేషన్‌కు సమీపంలోని బీసీ కాలనీలో ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఇక మామిళ్లపల్లి, తూంచర్ల, తగరకుంట ప్రాంతాల్లో పలుచోట్ల రైతులు విద్యుత్ స్తంభాలు లేక కట్టెలపైనే విద్యుత్ తీగలను లాగారు. వీటివల్ల ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

‘రణభేరి’ని విజయవంతం చేయండి



కదిరిలో రణభేరి పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నేతలు

కదిరి అర్బన్: ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, 29 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క డీఏ కూడా ఇవ్వకపోగా రూ.వేల కోట్ల బకాయిలు ఎప్పుడిస్తారో తెలీడం లేదన్నారు. ఆన్‌లైన్, అప్లోడింగ్ అంటూ బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, నేతలు తాహిర్‌వలీ, వైవీసుబ్బారెడ్డి, రమేష్, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నయా జోష్

- అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



కదిరి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కదిరి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. యువజన విభాగం అధ్యక్షుడిగా రమేష్‌యాదవ్, మహిళా విభాగం విజయలక్ష్మి, రైతు విభాగం మల్లిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, బీసీ సెల్ జెరిపిటి రామచంద్ర, ఎస్సీ సెల్ మేకల నరసింహులు, ఎస్టీ సెల్ రమణానాయక్, మైనార్టీ సెల్ పి.మహబూబ్‌ఖాన్, క్రిష్టియన్ మైనార్టీ సెల్ వెంకటేష్, పంచాయతీరాజ్ వింగ్ అక్బర్, మున్సిపల్ విభాగం కోలార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, ఆర్‌టీఐ వింగ్ జి.సతీష్‌రెడ్డి, వలంటీర్స్ వింగ్ పి.ఆంజనేయులు, గ్రీవెన్స్ సెల్ ఆర్.లోకనాథరెడ్డి, వాణిజ్య విభాగం షకీల్, చేనేత విభాగం జి.మురళి, వైఎస్సార్ టీయూసీ పి.ఖాదర్‌వలి, అంగన్‌వాడీ విభాగం కుంచపు మీనాకుమారి, లీగల్ సెల్ నాగేంద్రకుమార్‌రెడ్డి, కల్చరల్ వింగ్ పఠాన్ షాహిద్‌ఖాన్, సోషల్ మీడియా సిరియాల ఇబ్రహీం, దివ్యాంగుల విభాగం ఇంతియాజ్, డాక్టర్ల వింగ్ సి.బాబాసాహెబ్, ఇంటలెక్చువల్స్ ఫోరం వద్దిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ సివి.సుబ్బారావు, బూత్ కమిటీ విభాగం మొహిద్దీన్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కొలేపల్లి అంజాద్‌ఖాన్‌ను నియమించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

ధర్మవరం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నాలుగు డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, బకాయిలు చెల్లించాలని, హెల్త్ కార్డు పరిమితి పెంచాలని, అసెస్మెంట్ బుక్లెట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కేసు నమోదు

కదిరి టౌన్: పట్టణంలోని మశానంపేట ఏరియాలో ఉన్న ఇమ్రాన్ అతని తమ్ముడు మన్సూర్ తన ఆస్తుల విషయంలో గొడవపడ్డారు. ఇమ్రాన్ తన తల్లిగారితో ఆస్తుల విషయంలో మాట్లాడుతుండగా అతడి తమ్ముడు మన్సూర్, ఇమ్రాన్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. తర్వాత ఇద్దరూ పరస్పరం దాడి చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు పరస్పరం కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సాయి మనోహర్

ధర్మవరం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రజా ప్రతినిధులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ధర్మవరం డివిజన్‌లోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, కనగానపల్లి, ముదిగుబ్బ మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్యం, శుద్ధ జలాలు, పర్యావరణ పరిరక్షణ వంటి లక్ష్యాలను గ్రామ స్థాయిలో ఎలా అమలు చేయాలో ఎంపీడీఓ సాయిమనోహర్ తెలియజేశారు. చిన్న మార్పులు అభివృద్ధికి పునాదులు అవుతాయన్నారు. గ్రామాలు మారితే దేశం మారుతుందన్న దృక్పథంతో ఎల్‌ఎస్‌డీజీఎస్ ద్వారా 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించారన్నారు. వీటిని సాధిస్తే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం సాధ్యమవుతుందన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్, ఏఓ నబి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎకరాకు 10 బస్తాల యూరియా సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులకు ఎకరాకు 10 బస్తాల చొప్పున యూరియా సరఫరా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో యూరియా సరఫరాపై వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులు అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న, వరి పంటలు సాగు చేశారన్నారు. ఈరెండు పంటలకు యూరియా అవసరమని కానీ ప్రభుత్వం యూరియా పంపిణీ విషయంలో పూర్తిగా విఫలమైందన్నారు.రాష్ట్రంలో రూ.200 కోట్లు ఖర్చు చేసి యూరియా సరఫరా చేస్తున్నామని ప్రజా ప్రతినిధులు అధికారులు చెబుతున్నారే తప్ప ఆచరణలో కనిపించడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ గోడౌన్ల వద్ద రైతులు వేకువ జామునుంచి పడిగాపులు కాస్తే ఒక బస్తా యూరియా ఇంటికి తీసుకెళ్లలేని దుస్థితి ఉందన్నారు. మన రాష్ట్రానికి వచ్చిన యూరియాను ప్రైవేటు వ్యక్తులు ఇతర రాష్ట్రాలకు యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎకరాకు 10 బస్తాల యూరియా సరఫరా చేయాలని లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు రమాదేవి, ప్రమీల, శోభ, నూర్జహాన్ పాల్గొన్నారు.

ధర్మవరం డివిజన్‌లో మోస్తరు వర్షం



కుణుతూరు వంకలోకి చేరిన వర్షపు నీరు

ధర్మవరం రూరల్: ధర్మవరం వ్యవసాయ డివిజన్ వ్యాప్తంగా బుధవారం అర్ధరాత్రి నుంచి మోస్తరు వర్షపాతం కురిసింది. ప్రస్తుతం ఎండు దశలో ఉన్న వేరుశనగ పంటకు కురిసిన వర్షం కాస్త ఊరట కలిగించిందని రైతులు అంటున్నారు. ధర్మవరంలో 72.6, తాడిమర్రి 52.2. రామగిరి 48.2, చెన్నేకొత్తపల్లి 35.2, ముదిగుబ్బ 22.2, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

బత్తలపల్లిలో 28.4 మి.మీ వర్షపాతం

బత్తలపల్లి: మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షం 28.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. వర్షాభావ పరిస్థితులు కారణంగా మండలంలో పంటలు వాడుముఖం పట్టాయి. ఈ పరిస్థితుల్లో కురిసిన వర్షం పంటలకు ఉపయోగంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

కనగానపల్లిలో 26.2 మి.మీ వర్షం

కనగానపల్లి: వాతావరణ మార్పులతో బుధవారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. కనగానపల్లితో పాటు మామిళ్లపల్లి, తగరకుంట, యలకుంట్ల, దాదులూరు, తూంచర్ల, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఒకేరోజు 26.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. జడితో కూడిన వర్షం కురవడంతో కుంటలు, చెరువుల్లోకి నీరు చేరింది. కనగానపల్లితో పాటు పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపు నీరంతా రోడ్లపైనే నిలిచిపోగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సంక్షిప్త సమాచారం

పోలీసుల ముమ్మర తనిఖీలు



టీకేఫ్‌ను తనిఖీ చేస్తున్న టూ టౌన్ సీఐ రెడ్డెప్ప

ధర్మవరం: పట్టణంలోని టూ టౌన్ పరిధిలో ఉన్న టీకేఫ్‌లు, ధాబాల్లో సీఐ రెడ్డెప్ప గురువారం రాత్రి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎవరైనా అనుమానితులు లేదా కొత్త వ్యక్తులు గాని ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. వైన్‌షాపులు, హోటళ్లు, టీకేఫ్‌లు రాత్రి 10 గంటల్లోగా మూసివేయాలని ఆదేశించారు.

ఏపీ టూరిజం ఆస్తుల ప్రైవేటీకరణ ఆపాలి

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏపీ టూరిజం ఆస్తులను ప్రైవేటీకరించడాన్ని ప్రభుత్వం ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆంజనేయులు కోరారు. ఈమేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ టూరిజం కోసం గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏపీ టూరిజం శాఖకు దాదాపు రూ.10 వేల కోట్లు ఆస్తులు ఉన్నాయని తెలిపారు. వాటిని ప్రైవేటు పరం చేస్తే అందులో పనిచేసే వెయ్యి మందికి పైగా ఉద్యోగులు రోడ్డున పడే అవకాశం ఉందని, ప్రభుత్వం వెంటనే ఆ ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

కోడలిపై మామ చెప్పుతో దాడి

కదిరి టౌన్: సైదాపురానికి చెందిన మహిళపై ఆమె మామ చెప్పుతో దాడి చేశాడు. వివరాలు..సైదాపురానికి చెందిన ఆశా వర్కర్ లక్ష్మి, ఆమె భర్తకు కొద్ది రోజులుగా మనస్పర్థలున్నాయి. ఈక్రమంలో ఆమె గురువారం ఆమె భర్త సొంతూరు పులివెందులకు వెళ్లి భర్తతో మాట్లాడుతుండగా ఆమె మామ వెంకటేష్ చెప్పుతో దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

గొర్రెలు, పొట్టేళ్ల అపహరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గూడ్స్‌షెడ్‌కొట్టాలలో ఈనెల 9న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆరు గొర్రెలు, రెండు పొట్టేళ్లను అపహరించారు. టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాలు.. గూడ్స్‌షెడ్‌కొట్టాలకు చెందిన మండ్లి గంగాధర్ వ్యవసాయం చేసుకుంటూ గొర్రెలు, ఎనుములు మేపుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 9వతేది సాయంత్రం గొర్రెలు, పొట్టేళ్లను ఇంటి పక్కనున్న షెడ్‌లో వదిలాడు. అర్ధరాత్రి గొర్రెల అరుపులు వినపడగానే గంగాధర్, భార్య ఇద్దరూ చూడగా గుర్తు తెలియని దొంగలు షెడ్‌లో ఉన్న గొర్రెలను బొలెరోలోకి ఎక్కిస్తూ కనిపించారు. గంగాధర్ గట్టిగా కేకలు వేయడంతో దొంగలు గొర్రెలను తీసుకుని పారిపోయారు. వెంటనే షెడ్‌లోకి వెళ్లి చూడగా ఆరు గొర్రెలు, 2 పొట్టేళ్లు అపహరించినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా

ధర్మవరం అర్బన్: ఇసుక సరఫరాలో పారదర్శకత పెంచాలని ఆర్డీఓ మహేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఇసుక సరఫరా నిర్వహణను మెరుగుపరచడంతోపాటు వినియోగదారులకు సులభంగా సేవలు అందించాలన్నారు. ప్రజలలో విశ్వాసాన్ని పెంచడం కోసం అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాలన్నారు. గత నెలలో స్వాధీనం చేసిన ట్రాక్టర్లు, వాహనాలు, విధించిన జరిమానాల వివరాలను సమర్పించాలని తహసీల్దార్లకు ఆదేశించారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

చెన్నేకొత్తపల్లి: స్థానిక టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రంతో పాటు సూక్ష్మ పరిశ్రమలు, హ్యాండ్‌లూమ్ తదితర వాటిని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, నీటిపారుదల విధానం, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానం కూడా ఎంతో ముఖ్యమన్నారు.

ప్రభుత్వాస్పత్రికి బెడ్‌షీట్ల వితరణ

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ ఆసుపత్రికి బెడ్‌షీట్లు



ఆసుపత్రికి బెడ్‌షీట్లు అందిస్తున్న డాక్టర్ వై సోనియా

వితరణగా అందించడం హర్షణీయమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ నరసింహులు, పుల్లయ్య, రాధమ్మ తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గురువారం స్పందన ఆసుపత్రి వ్యవస్థాపకులు వైద్యులు వై సోనియా, బషీర్‌లు రూ.60 వేలు విలువ చేసే 200 బెడ్‌షీట్లను ప్రభుత్వ ఆసుపత్రికి అందించారు.

జేవీవీ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

కదిరి అర్బన్: ఈ నెల 13,14 తేదీల్లో విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వేదిక జిల్లా అధ్యక్షుడు నరసారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్‌నాగేశ్వరావ్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామగిరి: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12వ తేదీ (శుక్రవారం) మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ గంగావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 6వ తేదీనే సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అయితే ఆ రోజు సభ్యులు హాజరుకానందున 12వ తేదీకి వాయిదా వేసినట్లు ఆమె వెల్లడించారు. శుక్రవారం జరిగే సమావేశానికి హాజరు కావాలని సభ్యులకు, అధికారులకు సమాచారం అందించామని ఎంపీడీఓ వెల్లడించారు.

15న జీపు వేలం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం జీపును వేలం వేయనున్నట్లు ప్రాజెక్టు అధికారాణి కవితాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు చెన్నేకొత్తపల్లిలోని ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.3 వేలను చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



తనకల్లులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తనకల్లు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దేశాయి సంజీవరెడ్డి స్వగృహంలో మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల కో-కన్వీనర్ కొండకమర్ల ముస్తఫా, మహిళా విభాగం కన్వీనర్ విజయలక్ష్మి, మండల కమిటీ సభ్యులు కరే నరేంద్ర, సూరి, నాయకులు భక్తవత్సలరెడ్డి, పూల శంకర్, లక్ష్మిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రకాష్, యశ్వంత్‌రెడ్డి, ఇక్బాల్, అమీర్, కుమార్, విజయ్‌కుమార్, నరసింహులు, సాలెమ్మ, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



వీరారెడ్డి(ఫైల్)

తాడిమర్రి: శివంపల్లిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అల్లే శ్రీనివాసరెడ్డి కుమారుడు అల్లే వీరారెడ్డి (37) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ఆచూకీ లభించలేదు. యువకుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు.

పరామర్శ



గౌరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రామగిరి: మండలంలోని పేరూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు కంచుకుంట హనుమంతు సతీమణి గౌరమ్మ (40) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గౌరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, జేసీఎస్ కన్వీనర్ వెంకటరెడ్డి, మండల యూత్ కన్వీనర్ మణికంఠ, గుడుసాల ఈశ్వరయ్య, గుడుసాల వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌కు పరామర్శ

గాండ్లపెంట: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి గురువారం ఇంట్లో కాలుజారి పడడంతో కాలికి గాయమైంది. దీంతో ఆయన బెంగుళూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ బెంగళూరు వెళ్లి కన్వీనర్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

కొత్తచెరువు: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండ్లపల్లి జెడ్పీ హైస్కూల్ తెలుగు పండిట్ మాణిక్యం మహమ్మద్ ఇసాక్‌ను గురువారం పాఠశాలలో హెచ్‌ఎం నంజుండప్ప ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ సోమశేఖర్‌నాయుడు మాణిక్యం మహమ్మద్ ఇసాక్ సేవలను కొనియాడారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు అమరా చంద్రబాబు, కడియాల మల్లికార్జున, సర్పంచ్ రూప్లా నాయక్ పాల్గొన్నారు.